TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 128 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.02.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా..



మహబూబ్‌నగర్ "అమృత్ తెలంగాణ: ఒక్కసారి ఆశీర్వదిస్తే రెండేండ్ల అధికారంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం.. పదేండ్లు అధికారం ఇస్తే వందేండ్లకు సరిపడా అభివృద్ధిని చేసి చూపిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "సర్పంచ్ ఎన్నికల్లో మంచోళ్లకు అవకాశమివ్వండి.. ముంచేటోళ్లని దూరం పెట్టండి. కాళ్లల్లో కట్టెలు పెట్టేటోళ్లు.. హాఫ్, ఫుల్ బాటిల్స్ పట్టుకుని వస్తారు. వాళ్ల మాయలో పడితే అభివృద్ధికి అడ్డుపడినట్టే.. మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి గ్రామాభివృద్ధికి నిధులు తెచ్చేవారిని ఎన్నుకోండి" అని చెప్పారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. మంత్రి శ్రీహరి అధ్యక్షతన మక్తల్‌లో రెండేండ్ల ప్రజాపాలన విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో గత ప్రభుత్వం రూ. 8లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్ర ప్రజలపై భారం మోపింది.

ఆ సంక్షోభాన్ని అధిగమిస్తూ.. సంక్షేమం వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నాం" అని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ద్వారా రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేయబో తున్నాం. రెండేండ్లలో కొడంగల్ మక్తల్ నారాయణపేట ఎత్తిపోతలను పూర్తి చేసి పాలమూరుకు సాగునీరు అందివ్వాలనే లక్ష్యం పెట్టుకున్నాం. 96 శాతం రైతులు భూములిచ్చారు. ఎవరైనా అడ్డ పడితే ఊరుకోం. ఈ దిశగా పనులు పూర్తి చేయాలి. లేదంటే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికలకు ఈ సభ నుంచే శంఖారావం పూరిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాదు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సైతం పాలమూరు జిల్లాపై వివక్ష కొనసాగిందన్నారు. కూతవేటు దూరంలో ఉన్న కృష్ణానది నీటిని బీడు భూములకు మళ్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లా నుంచి సాధారణ వ్యక్తులు కూడా ఎమ్మెల్యేలుగా గెలిచారని, ఇక్కడి ప్రజల ఆదరాబిమానాలతోనే తాను ఈ రాష్ట్రానికి రెండో సీఎం అయ్యానని అన్నారు.

తట్ట బుట్ట నెత్తిన పెట్టుకుని వలసలు పోయే ఈ జిల్లా ప్రజలకు త్వరలోనే సాగు నీరు అందిస్తామని హామీనిచ్చారు. కరువు జిల్లా నుంచి ఎంపీగా గెలిచిన మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులకు మొండి చేయి చూపారని విమర్శించారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఖర్చు చేసి, సంగం బండ పగలగొట్టడానికి కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దండాపూర్ నిర్వాసితులకు 100 శాతం పరిహారం అందించామన్నారు. 2014లో తెచ్చిన 69 జీఓను తొక్కి పెట్టి కొడంగల్- నారాయణపేటకు తీరని అన్యాయం చేశారని అన్నారు. తాము ఈ ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. మహబూబ్‌నగర్ పరిధిలో ఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏండ్ల తరబడి ఎస్సీ వర్గీకరణకు నోచుకోలేదని, సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే తాము తెలంగాణలో అమలు చేశామని గుర్తు చేశారు.

గొర్రెలు, బర్రెలు వంటి పశువులు, చేపల లెక్కలు తేల్చిన మాజీ సీఎం కేసీఆర్ బీసీల లెక్కలు మాత్రం తేల్చలేదని ఎద్దేవా చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రాన్ని 2047వరకు గొప్ప రాష్ట్రంగా తీర్చి దిద్దుతామన్నారు. దానిలో భాగంగానే ఈనెల 8, 9, 10 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. అభివృద్ధికి గీటురాయిగా కాంగ్రెస్ బలపరిచిన వారినే సర్పంచులుగా గెలిపించాలని సీఎం కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిట శ్రీహరి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, అనిరుధ్‌రడ్డి, మేఘారెడ్డి, ఈర్లపల్లి శంకర్, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నాయకులు సీతాదయాకర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు శివకుమార్‌రెడ్డి, శివసేనారెడ్డి పాల్గొన్నారు.

## ఇక నాలుగే ప్రభుత్వ బ్యాంక్‌లు..!

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను భారీగా కుదించాలని మోడీ సర్కార్ నిర్ణేశించుకుంది. ఇందుకోసం బ్యాంక్‌ల విలీన ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రస్తుతం దేశంలో 12 ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)లు ఉన్నాయి. వీటిని నాలుగింటికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐదేండ్ల క్రితం 27 పీఎస్‌బీలు ఉండగా.. వీటిని డజన్‌కు పరిమితం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ సంఖ్యను నాలుగుకు పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఆర్థిక సంవత్సరం 2026-2027 మార్చి ముగింపు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సర్కార్ కసరత్తు చేస్తోంది. అదే జరిగితే పీఎస్‌బీల్లో వాటాల విక్రయం మరింత సులభం కానుంది. అదే విధంగా ఈ రంగంలో విలీనాల ద్వారా ఉద్యోగ అవకాశాలు భారీగా పడిపోనున్నాయని బ్యాంకింగ్ సంఘాలు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

2027 మార్చి కల్లా 12 బ్యాంక్‌లను నాలుగింటికి తగ్గించాలనేది ప్రధాన యోచన. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదనల ప్రకారం.. విలీనం అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)తో పాటు కెనరా, యూనియన్ బ్యాంక్ విలీనం తర్వాత ఏర్పడే మరో బ్యాంక్ మాత్రమే మిగలనున్నాయని రిపోర్టులు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అంశం ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నట్టు మనీకంట్రోల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా బ్యాంకులను తీర్చిదిద్దాలనే సాకుతో కేంద్రం విలీన ప్రయత్నాలు చేస్తోందని స్పష్టమవుతోంది. తొలుత చిన్న బ్యాంకులను కాస్త పెద్ద బ్యాంకులతో విలీనం చేసేలా సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తుందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తి తెలిపారు. మొత్తంగా పీఎస్‌బీలను నాలుగుకు తగ్గించడం ప్రణాళికలో భాగమని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ప్రణాళిక ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక శాఖ ఆమోదం అనంతరం క్యాబినెట్‌కు, ప్రధాని మంత్రి కార్యాలయానికి చేరనుంది. ప్రభుత్వరంగ బ్యాంకు లైన కెనరా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను విలీనం చేసి ఒక్క బ్యాంక్‌గా ఏర్పాటు చేసే యోచన చేసింది.





ఇక ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్ కలిసి విలీనం చేసి ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీలో విలీనం చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇవి కాకుండా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీల్లో విలీనం కానున్నాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు గురించి ఇప్పటి వరకు ఏ నిర్ణయమూ తీసుకోలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిని నాలుగింటిలో ఏదో ఒక దాంట్లో విలీనం చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

ఉద్యోగ అవకాశాలకు కోత

2017 నుంచి 2020 కాలంలో 27 పీఎస్‌బీలను 12 బ్యాంక్‌లకు తగ్గించారు. దీంతో ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గిపోయాయి. మరోవైపు పీఎస్‌బీల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతానికి పెంచేలా ఇటీవల కొత్త ప్రతిపాదనలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎఫ్‌డీఐల పరిమితి 20 శాతంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను క్రమంగా ప్రయివేటు, విదేశీపరం చేసే మోడీ సర్కార్ కుట్రల్లో ఇదో భాగమని బ్యాంకింగ్ సంఘాలు తీవ్రంగా ఆరోపిస్తోన్నాయి.

## జీహెచ్‌ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ ఆమోదం





హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపాల్టీల చట్టాల సవరణ ఆర్డినెన్స్‌లకు సోమవారం ఆయన ఆమోదముద్ర వేశారు. జీహెచ్‌ఎంసీలో 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను విలీనం చేయాలని ఈనెల 25న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఆర్డినెన్స్‌లను గవర్నర్ ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌లను గవర్నర్ ఆమోదించారు. జీహెచ్‌ఎంసీలో కలిపిన 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు సంబంధించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని నగర పాలక మున్సిపల్ కార్పొరేషన్లు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, మున్సిపాల్టీలు దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లు బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్, మున్సిపాల్టీలు పెద్ద అంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిభట్ల, జల్‌పల్లి, శంషాబాద్, మణికొండ, తుక్కుగూడ, నార్సింగి, సంగారెడ్డి జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలు ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ ఉన్నాయి.

## 'మెట్రో' భద్రతా విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోనే అత్యాధునిక రవాణా వ్యవస్థగా గుర్తింపు పొందిన హైదరాబాద్ మెట్రో రైలు సామాజిక బాధ్యతలో మరో చారిత్రక ముందడుగు వేసింది. తెలంగాణ ప్రభుత్వ సమానత్వం, గౌరవం, సమాన అవకాశాల స్ఫూర్తితో, మెట్రో భద్రతా విభాగంలో 20 మంది ట్రాన్స్‌జెండర్లను సిబ్బందిగా నియమించుకుంది. ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న వీరు సోమవారం(డిసెంబర్ 1) నుంచి ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో తమ విధులను ప్రారంభించారు.ప్రస్తుతం మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో విస్తరించిన హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజూ సుమారు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 30 శాతం మంది మహిళలే ఉన్నారు. ఈ నేపథ్యంలో మహిళా ప్రయాణికుల భద్రత, సౌకర్యం, వారిలో విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మెట్రో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్తగా నియమితులైన ట్రాన్స్‌జెండర్ సిబ్బంది ప్రధానంగా.. జనరల్, మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన కోచ్‌లలో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు ప్రయాణికులకు దిశానిర్దేశం చేయడం, అవసరమైన సమాచారం, సహాయం అందించడం చేస్తారు. స్కానర్ కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా ప్రయాణికులు సురక్షితంగా వెళ్లేలా చూడటం, స్ట్రీట్-లెవెల్, కాన్‌కోర్స్ ప్రాంతాల్లో భద్రతా విధుల్లో పాల్గొంటారు. ట్రాన్స్‌జెండర్ సిబ్బంది నియామకం భద్రతా చర్య మాత్రమే కాదని, సామాజిక

## కాంగ్రెస్‌ది కమీషన్ల కక్కుర్తి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అసెంబ్లీలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేస్తామన్నారనీ, ఇప్పుడు కమీషన్ల కోసం థర్మల్ విద్యుత్ ప్లాంట్లు కట్టాలని నిర్ణయించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్టీపీసీ యూనిట్ విద్యుత్‌ను రూ. 4.12కే ఇస్తున్నా కమీషన్ల కక్కుర్తితోనే ప్రజలపై రూ. 82 వేల కోట్ల భారం మోపుతోందన్నా రు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఆర్థిక మంత్రిగాను తాను అన్‌ఫిట్ అయ్యానం టూ ఆయన వ్యాఖ్యలపై అగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్కలా 20 శాతం, 30 శాతం కమీషన్లు తీసుకోవడం రాకనే తాను అన్‌ఫిట్ అయ్యానని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పవర్ హాలిడే ఇచ్చిన కాంగ్రెస్ అన్‌ఫిట్టా? లేదంటే నాణ్యమైన కరెంటు ఇచ్చిన బీఆర్‌ఎస్ అన్‌ఫిట్టా?అని అడిగారు. తెలంగాణ వచ్చి 12 ఏండ్లు అవుతున్నా విద్యుత్ శాఖలో ఆంధ్రా అధికారుల పెత్తనమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ తెచ్చింది ప్రజా పాలన కాదనీ, ఆంధ్రా ద్రోహుల పాలన అని విమర్శించారు. సింగరేణిలో పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి అనే ఆంధ్రా వ్యక్తిని జెన్‌కో డైరెక్టర్‌గా నియమించడమేంటని అడిగారు. తెలంగాణ విద్యుత్ ఇంజినీర్లను, ఉద్యోగులను అవమానించడమేనని అన్నారు. అర్హత లేని ఆంధ్రా అధికారుల కోసం తెలంగాణ బిడ్డలను బలిచేస్తారా? అని ప్రశ్నించారు. నాడు ఉద్యమకారుల ను అవమానించిన సమైక్యవాదులకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అందలం ఎక్కించారని ఆరోపించారు.

## మా నిర్ణయాలను వ్యతిరేకించటమే మీ పనా?

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'ప్రభుత్వ నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే మీ పనా..?' అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రశ్నించారు. 2022లో ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం లీజ్ లాండ్‌ను ఫ్రీ హోల్డ్ చేస్తే బీజేపీ ఎందుకు మాట్లాడలేదని ఆయన నిలదీశారు. సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలసీలకు సంబంధించి ఆ రెండు పార్టీలు అవాకులు చెవాకులు పేలుతున్నాయని విమర్శించారు. ఢిల్లీలో కాలుష్యం పెరిగి పాఠశాలలకు సెలవులు ఇస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనేదే తమ ఆలోచనని పేర్కొన్నారు. కానీ హైదరాబాద్‌కు ఆ దుస్థితి రావాలనే దుర్బుద్ధితో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఉన్నాయని దుయ్యబట్టారు. హిల్ట్ పాలసీ




జీవోలో సొంత భూములపై కన్జర్వేషన్ ఫీజు విధించాలనే అంశాన్ని చేర్చామని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ భూములను దారాదత్తం చేసిందే బీఆర్‌ఎస్ అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో యదేచ్ఛగా టైటిల్స్ మార్చారని దుయ్యబట్టారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీకి సంబంధించిన వంద ఎకరాల భూమిని గత ప్రభుత్వం కన్జర్వేషన్ చేసింది, అప్పుడు బీఆర్‌ఎస్‌కు నిబంధనలు గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. అందుకు భిన్నంగా తాము నిరూపయోగంగా ఉన్న పరిశ్రమల భూములను ఉపయోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ భూముల విషయంలో తాము ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదన్నారు. ఇండిస్ట్రీల వద్దనున్న భూముల గురించే పాలసీ రూపొందించామని వివరించారు. బీఆర్‌ఎస్ అలసత్వం వల్లే హైదరాబాద్ పరిసరాల్లో కాలుష్యకారక పరిశ్రమలు పెరిగాయని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా విమర్శించారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.









అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసే వారికి కుల ధ్రువపత్రాల జారి, బ్యాంకు ఖాతాలు తెరవడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అడిగారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. క్లస్టర్ లో ఇప్పటి వరకు దాఖలు అయిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ల వివరాలు వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో ఎంపీడీవో గజానన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. డిసెంబర్ 01 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. జిల్లాలో ప్రసూతి మరణాల తగ్గింపులో కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు. గతంలో ఉన్న ప్రసూతి మరణాల కేసులను అమ్మరక్షిత వంటి వినూత్న కార్యక్రమాల అమలుతో, క్షేత్రస్థాయి సిబ్బంది చొరవతో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు చెప్పారు. ముమ్మందు ప్రసూతి మరణాల రహిత జిల్లాగా నిర్మాణం తీర్చిదిద్దేలా మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు. ర్యాలీ సందర్భంగా కళాజాత బృందాలు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎంహెచ్ఓ రాజేందర్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, డీఈవో భోజన్న, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలని, ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. ప్రసూతి మరణాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా అధికారులు, సిబ్బంది మరింత పట్టుదలతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణకు సేవలందించినందుకు గాను పలువురు వైద్యులకు, ఎయిడ్స్ పై నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటాలను కలెక్టర్ అందజేశారు. అంతకుముందు జిల్లా వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి కళాజాత బృందం డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, వైద్యులు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ విశ్వంభర్ సేవలు మరువ లేనివి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న ఉద్యోగ విరమణ పొందిన బత్తుల విశ్వంభర్



ఉద్యోగ విరమణ సందర్భంగా బత్తుల విశ్వంభర్ సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి తహసిల్దార్ బత్తుల విశ్వంభర్ తన ఉద్యోగ జీవితంలో చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో దస్తురాబాద్ తహసిల్దార్ గా ఉద్యోగ విరమణ పొందిన విశ్వంభర్ కు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ శాఖకు విశ్వంభర్ చేసిన సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది తప్పనిసరి అని చెప్పారు. క్రమశిక్షణతో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ, అధికారుల మెప్పు పొందారని అన్నారు. శేష జీవితం మొత్తం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి గడపాలని ఆకాంక్షించారు. రెవెన్యూ ఉద్యోగులకు తన అనుభవ పూర్వక సలహాలు ఇస్తూ ఉండాలని అన్నారు. ఉద్యోగంలో ఎన్నో సేవలు చేసి, పదవీ విరమణ పొందే ఉద్యోగులను సన్మానించి, గౌరవించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ పొందిన తహసిల్దార్ విశ్వంభర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ శాఖకు ఆయన చేసిన సేవలు మరువలేనివి తెలిపారు. ఎంతో అనుభవం ఉన్న విశ్వంభర్ ఉద్యోగ విరమణ పొందడం శాఖకు లోటు అని అన్నారు. ఉద్యోగ పరంగానే కాకుండా, సామాజిక సేవలో కూడా ఎంతో చురుకుగా ఉండేవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన తహసిల్దార్ బత్తుల విశంభర్ మాట్లాడుతూ, పదవి విరమణ పొందిన తనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కలెక్టర్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో తనకు సహకారం అందించిన పై అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. తన ఉద్యోగ అనుభవాలు అందరితో పంచుకున్నారు. అనంతరం పదవి విరమణ పొందిన విశ్వంభర్ ను శాలువాలతో సన్మానించి, మెమొంటోలు అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి:- రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 4న జిల్లాకు చేసే పర్యటనను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకూడదని హెచ్చరించారు. స్టేజ్ ఏర్పాటు, వైద్య శిబిరం, పారిశుధ్యం, పార్కింగ్, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేయాలని సూచించారు. పర్యటన రోజున అధికారులు క్షేత్రస్థాయిలో మానిటరింగ్ చేయాలన్నారు. ఏరోడ్రోమ్ లో హెలిపాడ్, పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, అలాగే ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్న ప్రజా సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, మార్గాల గుర్తింపు వంటి అంశాలపై విభాగాలకు దిశానిర్దేశం చేశారు. సిఎం పబ్లిక్ సమావేశానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు ఎస్పీలు సురేందర్ రావు, ఏఎస్పీ మౌనిక, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామ ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం.....



గ్రంథాలయం ప్రారంభం



తాసిల్దార్ విశ్వంభర్ ను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన ప్రజలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్, (జి):డిసెంబర్ 1 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని సోమవారం సీనియర్ సివిల్ జడ్జి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.రాధిక ప్రారంభించారు. ఆమెకు రామాలయం ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు, ఎన్సీసి విద్యార్థినీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. యువతి యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పండ్ల మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయ ట్రస్ట్ అధ్యక్షుడు గోపిడి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి దర్శనం సుధాకర్, కోశాధికారి మంత్రి చంద్రశేఖర్, సభ్యులు, గ్రామస్తులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమానికి హాజరైన సీనియర్ సివిల్ జడ్జి జి రాధిక

# నామినేషన్ల స్వీకరణ




టెంభుర్ని గ్రామపంచాయతీ సర్పంచ్ కు నామినేషన్ వేసిన శ్రీధర్ రెడ్డి



కుస్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కు నామినేషన్ వేసిన గణేష్ పటేల్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి):డిసెంబర్ 1 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలో 13 గ్రామ పంచాయతీల గాను 35 సర్పంచ్ , వార్డు సభ్యులకు 83 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి తెలిపారు.



నూతన డిసిసిని సన్మానించిన శ్రీ ఆర్ రావు

# నూతన డీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన మాజీ డిసిసి శ్రీహరి రావు

నిర్మల్ డిసెంబర్ 01( అమృత్ తెలంగాణ ) కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ని మాజీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం అమెరికాలో ఉన్నందున డీసీసీ అధ్యక్షులను సత్కరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గ్రీవెన్స్ డే ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం**

**జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**




నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

నిర్మల్ డిసెంబర్ 01( అమృత్ తెలంగాణ ) జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# భవిషత్ తరాల కోసమే నూతన విద్యుత్ ప్రాజెక్టులు

**ఆర్థికాభివృద్ధి విద్యుత్ ఉత్పత్తి పై ఆధార పడింది**

**చీరల పంపిణీ కొనసాగుతున్న కార్యక్రమం..చీరల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వాలి..**

**ప్రజా పాలన ఉత్సవాలు అడ్డుకునే ప్రయత్నం ప్రతిపక్షాలు మానుకోవాలి..**

**ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి..**

**డబుల్ బెడ్రూం లబ్ధిదారులు ఇళ్లలో చేరాలి..**

**విలేకరుల సమావేశంలో.. మాజీ మంత్రి తాటి పర్తి జీవన్ రెడ్డి..**

జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 01: జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి విద్యుత్ ఉత్పత్తి పై ఆధారపడి ఉంది తెలంగాణ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. ఉచిత విద్యుత్ అమలుతో వ్యవసాయం విద్యుత్ అధిక వినియోగం అవసరం అని రాష్ట్ర విభజన లో రాష్ట్రం పై భారం వేయకుండా కేంద్రం 2400 మెగా వాట్స్ కేటాయించింది. రాబోయే ఇరవై ఏళ్ల లో అవసరమయ్యే విద్యుత్ వినియోగం పరిగణలోకి తీసుకొని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సోలార్, నీటి వనరులు ద్వారా చేపట్టే విద్యుత్ ఉత్తతికి తక్కువ వ్యయం అవుతుంది. థర్మల్ విద్యుత్ అధిక వ్యయం తో కూడుకున్నప్పటికీ ..గ్యారంటీ విద్యుత్ మెగా పవర్ పవర్ ప్రాజెక్ట్స్ రామగుండం,పాల్వంచ, మక్తాల్, ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. బొగ్గు లభ్యత ఉన్న స్థానంలో విద్యుత్ ఉత్పాదన ఏర్పాటు చేయాలి. రామగుండంలో జెన్ కో ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలనీ రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేశారు. 2014 లో యాదాద్రి పవర్ జనరేషన్ ప్రతిపాదన చేశారు. రామగుండం లో విద్యుత్ ఉత్పతి వ్యయం తక్కువగా ఉంటది. యాదాద్రి కన్నా రామగుండంలో విద్యుత్ నిర్మాణ వ్యయం తగ్గుతుంది. ప్రస్తుత విద్యుత్ యూనిట్ ధర.. భవిషత్ ధరతొ పోల్చడం ఏమిటి విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాలను ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు. ప్రతి అంశాన్ని విమర్శించడం సరికాదు..నిర్మాణాత్మకంగా ఆలోచించాలి. భవిషత్ తరాల కోసం వినియోగం కోసం రామగుండంలో 2400 మెగా వాట్ ల ఏర్పాటు చేస్తున్నాం. మూసి వేసిన బీ థర్మల్ ప్లాంట్ స్థానంలో మరో ప్లాంట్ ఏర్పాటు రామగుండం ప్రాంత ప్రజల ఆకాంక్ష




రాష్ట్ర ప్రభుత్వం భవిషత్ తరాల అవసరాల కోసం ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తుంటే ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజా పాలన ఉత్సవాలను అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు అన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన.




అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 01: మెట్ పల్లి ప్రభుత్వ హై స్కూల్లో మెట్పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు ఎంబిబిఎస్ డిజిఓ డాక్టర్ పుప్పాల సంధ్యారాణి పటేల్ ఎయిడ్స్ పై అవగాహన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చాలామంది ఎయిడ్స్ పై అవగాహన లేక భయపడుతుంటారని వారి అపోహాలు తొలగించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పోషకాలు ఉన్న ఆహారం తీసుకొని అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు, సెక్రెటరీ జైపాల్ రెడ్డి, క్యాషియర్ వేములవాడ చంద్రశేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, డాక్టర్ పుప్పాల సాగర్ పటేల్, ఆల్ రౌండర్ గంగాధర్, ప్రిన్సిపాల్ దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.

**ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించి విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశం.**

**సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహణ.**

**జిల్లా నలుమూలల నుండి వచ్చిన 28 ఫిర్యాదుదారులు**

**ఫోన్ ద్వారా సిబ్బందికి పరిష్కారం చూపాలని ఆదేశాలు**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఓర్పుతో విని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలను ఇవ్వడం జరిగింది. ఫిర్యాదు దారుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదు పట్ల జవాబుదారిని కలిగి ఉండాలని తెలిపారు. ప్రజల సమస్యల పట్ల ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి దర్యాప్తును జరిపి, బాధితులకు న్యాయం జరిగే విధంగా విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 28 మంది ఫిర్యాదుదారులు వచ్చి నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను విన్నవించుకున్నారు. తన గ్రామాలలో మండలాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల పట్ల, చట్ట వ్యతిరేక కార్యకలాపాల పట్ల జిల్లా ఎస్పీ గారికి నేరుగా సమాచారం అందించాలన్న, సమస్యలను తెలియజేయాలన్న వాట్సాప్ ద్వారా 8712659973 నెంబర్ కు సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ముఖ్యంగా గంజాయి, గుడుంబా లాంటి సమాచారం ఏదైనా తెలియజేయవచ్చును



అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్.

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**

జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 01: ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన (05) మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# లావు వడ్లను కొనుగోలు చేయాలి

వనపర్తి :అమృత్ తెలంగాణ: జిల్లాలో రైతులు పండించిన లావు వడ్లను కూడా ధాన్యం కేంద్రాల్లో అధికారులు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో చినగుంటపల్లి సింగల్ విండో కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సుమారు 20 రోజుల క్రితం వడ్లు సెంటర్లకు తీసుకువచ్చి తేమ శాతం వచ్చినా కొనుగోలు కేంద్రాల్లో సరిగా కొనుగోలు చేయడంలేదన్నారు. లావు వడ్లు పండించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే లావు వడ్లను అధికారులు కొనాలన్నారు. గత రబీ సీజన్లో పండించిన సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 లు బోనస్ ఇస్తామని చెప్పి నేటి వరకు రైతులకు చాలామందికి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు లావు వడ్లను కొనమంటే సాకులు చెబుతున్నారని తెలిపారు. రైస్ మిల్లర్స్



వారు దింపుకుంటలేరని, తర్వాత కొంటామని కొన్ని కేంద్రాల్లో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఐదు నెలలపాటు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉండే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లావు వడ్లను సన్న వడ్లను సకాలంలోకొని సకాలంలో అకౌంట్లో డబ్బులు పడేలా చూడాలన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ




బల్మూరు : మండలంలోని శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొండనాగుల విద్యార్థులు సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలోనిర్వహించిన ర్యాలీ కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి కారణాలు, నివారణ చర్యలు, అవగాహన అవసరం గురించి తెలుసుకోవాలన్నారు. ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించడం మరియు సమాజంలో అవగాహన పెంపొందించడం యువత బాధ్యత అని పేర్కొన్నారు. కొన్నాల గ్రామంలో డిగ్రీ కళాశాల నుండి పట్టణ ప్రధాన వీధుల ద్వారా ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎర్ర రిబ్బన్, ప్లకార్డులు, నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ డూప్ సింగ్,డాక్టర్ ఆర్ వెంకటయ్య,డాక్టర్ లక్ష్మ గౌడ్,అధ్యాపకేతర సిబ్బంది బి నరసింహులు చాంద్ బీ ఉన్నారు.

# పాలమూరులో తట్ట మన్ను తీయలేే



వనపర్తి :అమృత్ తెలంగాణ: పాలమూరులో తట్ట మన్ను తీయలేే కానీ మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప ఒక్క పని కూడా చేసింది లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అని విమర్శించారు. సోమవారం మక్తల్ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకోవడం తప్ప రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చేసింది ఏం లేదని, చూసుకోని ముర్వ .. చెప్పుకుని ఏడ్వ అన్నట్లుంది పాలమూరు పరిస్థితి ఏర్పడిందన్నారు. మాటలు కోటలు దాటుతున్నాయి.. తప్ప ఒక్క పని కూడా చేసింది లేదన్నారు. శంకుస్థాపనలు తప్ప రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల గురించి అబద్ధాలు చెప్పడానికి కొంచెం అయినా సిగ్గు ఉండాలన్నారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో చేసిన అప్పు కేవలం రూ.3.48 లక్షల కోట్లు .. చేసిన అభివృద్ధి, గణాంకాలు కండ్ల ముందు ఉన్నాయన్నారు. కేవలం రెండేళ్లలో కార్పోరేషన్ రుణాలు కాకుండానే రూ.2.50 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. సంక్షేమ పథకాలు ఎగ్గొట్టారు .. అభివృద్ధి పనులు పక్కనపెట్టారన్నారు. రైతులను గాలికి, పంటలను వాటి కర్మానికి వదిలేశారన్నారు. బోనస్ అని బోగస్ మాటలు చెప్పారని, బ్రోకర్ల అవతారం ఎత్తారన్నారు. తెలంగాణ రైజింగ్ అంటూ అప్పులు తెస్తుండడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. కరోనా కష్టకాలం లోనూ తెలంగాణ రెవెన్యూ 25 శాతం వరకు పెరిగిందన్నారు. కాంగ్రెస్ పాలన పుణ్యాన ఈ ఏడాది 0.76 % శాతానికి పడిపోయిందని విమర్శించారు. అడ్డగోలు అప్పులు చేసి అభివృద్ధిని తిరోగమనం వైపు నడిపిస్తూ రైజింగ్ అంటూ పొంకనాలు కొట్టడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. కూట్ల రాయి తీయలేనోడు .. ఏట్ల రాయి తీస్తా అన్నాడట అని ఏద్దేవా చేశారు. కొడంగల్ సభలో రేవంత్ 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పంచాయతీలను రెండేళ్ల పాలనతో భ్రష్టు పట్టించిన రేవంత్ అభివృద్ధి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారన్నారు. పాలమూరు ప్రాజెక్టులను గాలికి వదిలేశారన్నారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేసి సాగునీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రెండో విడత పకడ్బందీగా నిర్వహించాలి



వనపర్తి అమృత్ తెలంగాణ: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు మండల తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, వచ్చిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి మండల స్థాయిలలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

# గ్రామ అభివృద్ధికై సర్పంచ్ గా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి




భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి, మండలం లోని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా భువనగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆశీర్వాదంతో తిమ్మాపురం నుండి, వేల మంది ఓటరు మహాశా యులతో గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీగా బయలు దేరి వడ పర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అనంతరం, ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతు తిమ్మాపురం,గ్రామం మొత్తం ముంపునకు గురి అయిందని చాలా, మంది నిరుపేద సన్నకారు, రైతుల భూములు నృసింహ, బస్వాపూర్ ప్రాజెక్ట్ లో పోయిందని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు అండగా ఉంటూ ప్రభుత్వం తో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం తన బాధ్యత అన్నారు. తిమ్మాపురం గ్రామం లో రోడ్లు డ్రైనేజ్, వ్యవస్థ, వీధి లైట్లు లేక ప్రజలు అవస్థలు పడడం చూసి చలించ లేక ఊరి అభివృద్ధి కొరకు మీ అందరి సహకారం దీవెనలతో నేడు సర్పంచ్ గా నామినేషన్ వేయడం జరిగిందిని అన్నారు. గ్రామ సర్పంచ్ గా ఒక్కసారి నాకు అవకాశం ఇచ్చి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఖచ్చితంగా ఊరు అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. ఈ నామినేషన్ ర్యాలీ లో ఓటర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా గీతా జయంతి వేడుకలు




కట్టంగూర్ :అమృత్ తెలంగాణ: మానవాళికి జీవన విధానాన్ని ప్రబోధించే శ్రీమద్ భగవద్గీత జయంతి పర్వదినమైన మోక్షద ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత ఏకాదశి పర్వదినం సందర్భంగా తృతీయ వార్షిక పంచమ మహా యజ్ఞాన్ని ఆలయ పూజారి రాముడుగు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం గీతా జయంతిని పురస్కరించుకుని భగవాన్ శ్రీకృష్ణుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు సామూహిక గీతా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ భగవాన్ శ్రీకృష్ణుడు సర్వమానవాళి ఉద్దేశించి ప్రబోధించిన సందేశాత్మక గ్రంథం అన్నారు. ఈ కార్యక్రమాల్లో రామడుగు శశిరేఖ, కొంపెల్లి లక్ష్మయ్య మంగమ్మ, ఓరుగంటి రమేష్ ఉష దంపతులు, గుడిపాటి పద్మ, కడవేరు కృష్ణవేణి, గుండు రూప, కొత్త శోభ, ఇల్లందుల సంధ్యమ్మ, మూడుదుడ్ల ఆండాలు, చేగోని లక్ష్మి, నల్ల ధనమ్మ, కోమటి భాస్కర్, రెడ్డిపల్లి సైదులు పాల్గొన్నారు.

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# రవితేజ.. పర్ఫెక్ట్ పండగ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల వరుస అపజయాలతో వెనుకబడ్డ రవితేజ, తన తదుపరి సినిమాలకు చాలా జాగ్రత్తగా స్క్రిప్టులు ఎంపిక చేసుకుంటున్నాడు. మాస్ జాతర అనే హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే, తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. రవితేజ కూడా వెంకటేష్ తరహాలో టార్గెట్ సెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల వెంకటేష్ – అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వెంకీ కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమా సక్సెస్ కావడానికి కాంబినేషన్ ఒక కారణమైతే రిలీజ్ స్లాట్ మరో ముఖ్యమైన రీజన్. ఇక రవితేజ కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలోకి దిగబోతున్నాడట. సాధారణంగా సంక్రాంతి టాలీవుడ్‌కు బిగ్గెస్ట్ సీజన్. ప్రతి పెద్ద హీరో తన సినిమాను ఈ పండగ సీజన్‌లో రిలీజ్ చేయాలని చూస్తాడు.

ఇప్పటివరకు ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్, చిరంజీవి–అనిల్ రావిపూడి ప్రాజెక్ట్‌లు ఈ ఫెస్టివల్ సీజన్ కోసం లైన్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ పోటీకి మాస్ మహారాజా కూడా జాయిన్ అవుతుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. సంక్రాంతి సక్సెస్ రేషియోలో ఉన్న అనిల్ ఈసారి చిరంజీవితో వస్తున్నారు కాబట్టి ఆ సినిమాకు పోటీగా నిలవడం అంత ఈజీ కాదు. అయితే రవితేజ కూడా ఓ ప్లానింగ్ తోనే వస్తున్నాడు. తన కొత్త సినిమాను క్లాస్ మేకర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేయబోతున్నాడనే న్యూస్ కన్ఫర్మ్ అయింది. కిషోర్ తిరుమల సినిమాలకు యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంటుంది.

నేను శైలజ, చిత్ర లహరి వంటి ప్రాజెక్ట్స్‌తో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు, రవితేజతో కలిసి ఏ తరహా కథను తీసుకురాబోతున్నాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు రవితేజ మాస్ యాక్షన్ పాత్రలలోనే ఎక్కువ కనిపించాడు. అయితే, ఈసారి మాత్రం ఫ్యామిలీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఉండేలా స్క్రిప్ట్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. దీంతో ఇది సంక్రాంతికి పర్ఫెక్ట్ సినిమా అవుతుందనే ఆలోచనలో ఉన్నారట.

వెంకటేష్ తరహాలోనే మాస్ రాజా కూడా సంక్రాంతి టైమ్ లో సీజన్ కు తగ్గ కాంటెంట్ తో హిట్టు కొట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నాడు. గతంలో దసరా, రామారావు ఆన్ డ్యూటీ లాంటి సినిమాలను నిర్మించిన ఈ నిర్మాత ఇప్పుడు రవితేజ – కిషోర్ ప్రాజెక్టును కూడా గ్రాండ్ గా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. మాస్, క్లాస్ మిక్స్‌గా రూపొందనున్న ఈ సినిమా, సంక్రాంతి రిలీజ్ కోసం ముందుగానే ప్లాన్ చేయబడింది.

# ఎప్పుడు ఏ వైపు నుంచి ఫోటో తీస్తారో తెలీదు!



ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. బాడీ ఇమేజ్‌తో తన కష్టాల గురించి ఎప్పుడూ ఓపెన్‌గా చెప్పే నటి సోనాక్షి సిన్హా, తన అధిక బరువు గురించి ఎప్పుడూ ఓపెన్ గా మాట్లాడుతుంది. ప్లస్ సైజ్ తనకు ఎప్పుడూ అడ్డంకి కాదని ధైర్యంగా చెబుతుంది. ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. దీని కారణంగా పబ్లిక్ లో గోప్యత విషయమై గందరగోళం నెలకొంటుందని, భారతదేశంలో ఈ విషయంపై జాగ్రత్త వహించాలని సోనాక్షి అంది. అలాగే తాను భారతదేశంలో స్విమ్మింగ్‌ను ఎందుకు ఇష్టపడను?అనే విషయాన్ని కూడా మాట్లాడింది. ఈత దుస్తులను ధరించేటప్పుడు.. ముఖ్యంగా పెరిగే వయసులో నేను ఎల్లప్పుడూ స్పృహతో ఉన్నాను. నేను ముంబయిలో లేదా ఈ దేశంలో ఈత కొట్టను.ఎందుకంటే ఎవరైనా రహస్యంగా ఫోటో తీసి ఎప్పుడు ఎక్కడికి పంపుతారో నాకుతెలియదు. ఇది ఇంటర్నెట్‌లో షికార్ చేయడం నాకు ఇష్టం లేదు. నేను భారతదేశం వదిలి ఎక్కడికైనా వెళ్లినప్పుడుఈతకొడతాను.అనిస్పష్టంగా చెప్పింది. సినిమాఈ భయంవెనక ఏదోఒకకారణం ఉంటుంది.అలాగే నన్ను బరువుతగ్గాలనిఅమ్మఎప్పుడూ చెబుతూ ఉండేదని, కానీదానికి విరుద్ధంగా చేయడానికి ఇష్టపడేదానిని అని కూడా సోనాక్షి తన మొండితనం గురించి చెప్పింది.చిన్న పిల్లలుగా మనస్తత్వాలు అలా ఉంటాయి. కానీ మా అమ్మ నాకు చెప్పడం మానేసిన రోజునే నా బరువు గురించి నేను ఏదైనా చేయాల్సిన అవసరం ఉందని నాకు అనిపించిందని తెలిపింది.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com